# మూగజీవులకు ఎంతకష్టం!

**డ్రైనేజీ నీటిని తాగుతున్న వన్యప్రాణులు**

**కంచ గచ్చిబౌలిలో దయనీయ పరిస్థితి**

**వైరల్‌గా మారిన కేటీఆర్ పోస్ట్**

**రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన నెటిజన్లు**

కొండాపూర్, మే 16: పాపం.. నిలువ నీడలేక, తాగడానికి నీళ్లు లేక కంచ గచ్చిబౌలి జింకలు అవస్థ పడుతున్నాయి. ఈ భూముల్లోని అడవిని రేవంత్ సర్కార్ ఇష్టమొచ్చినట్టు తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇటీవల జనావాసాల్లోకి వచ్చిన జింకల చిత్రాలు వైరల్ అయిన విషయం తెలిసిందే. కుక్కల దాడిలో మరణించిన జింకల ఫొటోలు మనను కదలించిన సంగతి విదితమే. తాజాగా ఆ మూగజీవాలు గొంతు తడుపుకోవడానికి మురుగు నీరే గతైంది. కంపు కొడుతున్నప్పటికీ ముక్కు మూసుకొని గొంతు తడుపుకోవాల్సిన దుస్థితి. శుక్రవారం నల్ల గండ్ల నవోదయకాలనీ నుంచి వెలువడుతున్న డ్రైనేజీ నీటిని పలు జింకలు తాగుతూ కనిపించాయి. ఆ మురుగు నీటిలోనే సంచరించాయి. మురుగునీటిలో తిరుగుతున్న జింకలను పలువురు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం మురుగునీటిలో తిరుగుతున్న జింకల ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేయడంతో వైరల్ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేసిన పాపానికి వన్యప్రాణులు తమ నివాసాలను కోల్పోయి.. ఇలా డ్రైనేజీ మురుగులో తిరుగుతున్నాయంటూ పలువురు సోషల్ మీడియాలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

## కంపు నీళ్లతో కడుపు నింపుకుంటున్న జింకలు





తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న గెల్లు. చిత్రంలో తుంగబాలు తదితరులు

# ఇంజినీరింగ్ ఫీజులు పెంచొద్దు

- ఫీజు పెంపు నివేదిక తప్పుల తడక
- వాటిపై విచారణ చేపట్టాలి
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ డిమాండ్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే రెండేండ్ల వరకు ఇంజినీరింగ్ కళాశాలల్లో ట్యూషన్ ఫీజులే పెంచవద్దని, తాజాగా ఫీజుల పెంపు యోచనను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలలో విచ్చలవిడిగా ట్యూషన్ ఫీజులు పెంచుతున్నారని, రూ.1.60 లక్షల వరకు ఉన్న ట్యూషన్ ఫీజును ఏకంగా రూ.2.80 లక్షల వరకు పెంచారని, ఇంత పెద్ద మొత్తం ఫీజులను పేద విద్యార్థులు ఎలా భరిస్తారని ప్రశ్నించారు. ఫీజుల నియంత్రణపై సీఎం ఎందుకు చొరవ తీసుకోవడం లేదని నిలదీశారు. అందాల పోటీలపై సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్న శ్రద్ధ విద్యార్థులపై ఎందుకు లేదని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే ఇంజినీరింగ్ విద్యను ఉచితం చేస్తామని, ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వమే ఇస్తుందని, ప్రభుత్వమే ట్యూషన్ ఫీజులను భరిస్తుందంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా విద్యాశాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇంతవరకు ఆ శాఖ బాగోగులపై, ట్యూషన్ ఫీజుల నియంత్రణపైనా ఇప్పటివరకు ఎలాంటి సమీక్ష సమావేశం నిర్వహించలేదని దుయ్యబట్టారు.

### యాజమాన్యాల నివేదికపై అనుమానాలు

ట్యూషన్ ఫీజుల పెంపు కోసం ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు సమర్పించిన నివేదికలపై అనేక అనుమానాలు ఉన్నాయని గెల్లు శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఆ నివేదికల నిగ్గు తేల్చాలంటే థర్డ్‌పార్టీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టీఏఫ్ఆర్సీ ఆడిటర్లు కూడా కుమ్మక్కై ఫీజుల పెంపునకు సహకరిస్తున్నారని దుయ్యబట్టారు. యాజమాన్యాలకు తలొగ్గకుండా ప్రభుత్వం ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఫీజుల పెంపుతో రాష్ట్రంలోని లక్ష కుటుంబాలపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని కొన్ని ఇంజినీరింగ్ కాలేజీలు సిండికేటై మోసానికి తెరలేపాయని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

# గుంట నక్కలెవరో ప్రజలకు తెలుసు

- కంచ గచ్చిబౌలి విషయంలో సుప్రీం వ్యాఖ్యలను స్వాగతిస్తున్న ప్రజలు
- పర్యావరణ చట్టాలను ఉల్లంఘించిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలి
- రూ.10వేల కోట్ల కోసం ప్రజలను తప్పుదారి పట్టించిన ముఖ్యమంత్రి
- బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద ధ్వజం
- పుస్తకాలు రాసినోళ్లకు గ్రూప్-1లో మార్కులు ఎలా తగ్గాయి
- ఎమ్మెల్యే కే సంజయ్ నిలదీత
- భట్టి విక్రమార్కకు సీఎం బాధ్యతలు అప్పగించాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్



శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కే సంజయ్, అనిల్‌జాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కేపీ వివేకానంద

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కంచ గచ్చిబౌలి భూముల గుంట నక్కలు ఎవరో ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద చెప్పారు. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి చెట్లను నరికించిన సీఎం రేవంత్‌పై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రజలు స్వాగతిస్తున్నారని తెలిపారు. కోర్టుకు సెలవులు ఉన్నప్పుడు కంచ భూముల్లో చెట్లు నరికారని దుయ్యబట్టారు. రూ.10 వేల కోట్లకు కక్కుర్తి పడి ప్రజలను తప్పుదారి పట్టించారని మండిపడ్డారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి దొంగలా దొరికిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యేలు కే సంజయ్, అనిల్‌జాదవ్‌తో కలిసి వివేకానంద విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని, ఆ భూముల్లో చెట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల కోసం రూ.170 కోట్లను బ్రోకర్లకు ప్రభుత్వం చెల్లించిందని ఆరోపించారు. రూ.10 వేల కోట్ల రుణంపై స్వతంత్ర దర్యాప్తు జరుగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ లేవనెత్తిన అంశాలనే సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ (సీఈసీ) తన నివేదికలో స్పష్టం చేసిందని చెప్పుకొచ్చారు. రేవంత్ సర్కార్ ఆర్థిక అవకతవకలపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) నడుస్తున్నదని వివేకానంద ఎద్దేవా చేశారు.

### ఉద్యమకారులకు గ్రూప్-1లో మార్కులు ఎందుకు తగ్గాయి? కే సంజయ్

తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పుస్తకాలు రాసిన వారే గ్రూప్-1 పరీక్షలకు హాజరైతే.. వారికే ఈ పరీక్షలో ఎందుకు మార్కులు తగ్గాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ జవాబు పత్రాలను తెలంగాణ వాళ్లతో దిద్దించారా? లేక ఆంధ్రోళ్లతో దిద్దించారా?అని సందేహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు వేర్వేరుగా హాల్‌టిక్కెట్లు ఎందుకు జారీ చేశారని నిలదీశారు. కమీషన్లపై స్వయంగా క్యాబినెట్ మంత్రులే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

### ప్రశ్నించడం తప్పా?: అనిల్ జాదవ్

రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని మల్లు భట్టి విక్రమార్కకు అప్పగించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడాన్ని ఖండించారు. రాములు నాయక్ కోడలికి గ్రూపులో మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించడం తప్పా? అని నిలదీశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎవరు మాట్లాడినా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ కేసులకు ఎవరు భయపడడం లేదన్నారు. కేసులు పెట్టాల్సి వస్తే.. కొడంగల్ ఎన్నికల ప్రచారంలో బీరు సీసా, బిర్యాని ఇస్తే ఓట్లు వేస్తారని వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ పై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

# 50 కాలేజీల్లో ఫీజుల పెంపునకు బ్రేక్?

- ఆ కాలేజీల్లో అసాధారణంగా ఫీజులు
- ఫీజుల పెంపుపై సర్కారు అభ్యంతరం
- పునర్విచారణకు ఆదేశించిన సర్కారు

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీటెక్ ట్యూషన్ ఫీజుల సవరణ మళ్లీ మొదటికి రానున్నదా? దాదాపు 50 కాలేజీల్లో ఫీజుల పెంపునకు బ్రేకులు పడనున్నాయా? అంటే అవుననే సంకేతాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీటెక్ ఫీజుల పెంపు ప్రతిపాదనలపై మళ్లీ పునర్విచారణ జరుపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే ఖరారుచేసిన ఫీజులను రీవెరిఫికేషన్ చేయాలని కోరింది. దీంతో ఫీజుల సవరణ అంశం మొదటికొచ్చింది. రాష్ట్రంలో బీటెక్ ట్యూషన్ ఫీజుల సవరణపై తెలంగాణ ఫీజు అడ్మిషన్ అండ్ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఇప్పటికే ఒక దఫా విచారణను పూర్తి చేసింది. పలు కాలేజీల్లో ఫీజులను ఆ కమిటీ ఖరారుచేసింది. ఇటీవలే ఈ ఫీజుల ఆమోదానికి టీఏఎఫ్ఆర్సీ కమిటీ సమావేశాన్ని నిర్వహించగా, ప్రతిపాదిత ఫీజులపై ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. మొత్తంగా సర్కారు గుర్రుగా ఉండటంతో 50 కాలేజీల ఫీజులు తగ్గుతాయన్న ప్రచారం జరుగుతున్నది. ఏ కాలేజీల్లో తగ్గుతాయి, ఏ కాలేజీలకు కోతలు పడతాయన్న ఆందోళనలు కాలేజీ యాజమాన్యాల్లో వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నాయి. ఇంతమాత్రం దానికి టీఏఎఫ్ఆర్సీ ఎందుకు? కసరత్తు దేనికని ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు గౌతం రావు ప్రశ్నించారు. టీఏఎఫ్ఆర్సీ, సర్కారు నిర్ణయాన్ని బట్టి తాము ప్రతిస్పందిస్తామని తెలిపారు.

### 50 కాలేజీల్లో పెరుగుదలపై అనుమానాలు

40-50 కాలేజీల్లో ఫీజులు అసాధారణంగా పెరగడంపై సర్కార్ అనుమానాలను వ్యక్తంచేసింది. ఒకేసారి రూ.50-60 వేల ఫీజులు పెరగడానికి దారితీసిన కారణాలపై ఆరా తీసింది. ముఖ్యంగా రెండు, మూడు కాలేజీల్లో ఫీజులు రూ.2 లక్షలకు చేరాయి. పలు కాలేజీల్లో ఒకేసారి 50-60 వేల ఫీజులు పెరిగాయి. మరో 9-10 కాలేజీల్లో ఫీజులు పెరగనేలేదు. ఇలా ఇష్టారీతిన ఫీజులను పెంచడంపై సర్కారు వర్గాలు టీఏఎఫ్ఆర్సీని ప్రశ్నించాయి. ఈ ఫీజులపై మళ్లీ విచారణ జరపాలని ఆదేశించింది. దీంతో టీఏఎఫ్ఆర్సీ కమిటీ ఆయా ఫీజులపై మళ్లీ విచారణ జరపనున్నది. మళ్లీ 40-50 కాలేజీలను తిరిగి విచారణకు పిలుస్తారా? లేక ఆడిటర్లతో నివేదికలను తనిఖీ చేయిస్తారా? లేదంటే టీఏఎఫ్ఆర్సీ కమిటీ సభ్యులే విచారణ జరుపుతారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.




బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

# టిప్పర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలి

**బోధన్‌లో జర్నలిస్టుల ఆందోళన**

బోధన్, మే 16: సీనియర్ జర్నలిస్టులతో అనుచితంగా వ్యవహరించిన టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బోధన్‌లో జర్నలిస్టులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇసుక అక్రమరవాణా, తవ్వకాలపై ప్రత్యేక కథనం రాసినందుకు బోధన్ 'నమస్తే తెలంగాణ' ఆర్సీ ఇన్‌చార్జి బలరామరాజు, టీన్యూస్ రిపోర్టర్ తారాచంద్ దిష్టిబొమ్మలను టిప్పర్ల యజమానులు, ట్రాక్టర్ల డ్రైవర్లు బుధవారం దహనంచేసిన విషయం తెలిసిందే. నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేసే వాహనాల యజమానులు ఇద్దరు సీనియర్ జర్నలిస్టులతో అనుచితంగా వ్యవహరించడంపై జర్నలిస్టులు బోధన్ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణకు వినతిపత్రం అందజేశారు. బోధన్ ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రవికుమార్, మాజీ ప్రధాన కార్యదర్శిశ్రీనివాస్, మాజీగౌరవాధ్యక్షుడు గంగు లు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




ఇక్కడ జనం టవర్ల మీద, ట్యాంకుల మీద వున్నారు.. ఇంట్రస్టింగ్!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 41.2°c | 24.9°c |
| రంగారెడ్డి | 39.7°c | 20.5°c |
| నిజామాబాద్ | 38.3°c | 26.6°c |
| మెదక్ | 38.2°c | 26.9°c |
| ఖమ్మం | 38.0°c | 26.0°c |
| వరంగల్ | 36.0°c | 22.0°c |
| కరీంనగర్ | 36.0°c | 27.0°c |
| మహబూబ్‌నగర్ | 36.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 35.4°c | 23.3°c |
| నల్లగొండ | 31.0°c | 27.0°c |

# శ్రమదానంతో ప్రాయశ్చిత్తం చేసుకోండి

**హెచ్‌సీయూలో నరికిన చెట్లను తిరిగి నాటండి**

**ప్రభుత్వానికి ఎమ్మెల్సీ దాసోజు బహిరంగలేఖ**



హైదరాబాద్ మే 16 (నమస్తే తెలంగాణ): 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి, మంత్రులు హెచ్‌సీయూలో శ్రమదానం చేసి నరికిన చెట్లను తిరిగి నాటండి' అంటూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ చురకలంటించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. సుప్రీం తీర్పుతోనైనా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని అన్నారు. ప్రకృతిని నాశనం చేసే సర్కారు చర్యలు.. రాక్షస స్వభావానికి నిదర్శమని ఆయన మండిపడ్డారు. పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కారుపై పచ్చదనం కోసం పరితపిస్తున్న యువత ఆగ్రహంగా ఉన్నదని స్పష్టంచేశారు. 'మీరు చేసిన అరాచకానికి మీరే బాధ్యులు.. మొక్కలు నాటి ఆ చేతలతో క్షమాపణలు చెప్పండి' అని నిలదీశారు.

# మావోయిస్టులతో చర్చలు జరపాలి

**రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్**



ఉస్మానియా యూనివర్సిటీ: మావోయిస్టులతో తక్షణమే కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. చర్చలు జరుపుదామని మావోయిస్టులు ప్రతిపాదిస్తున్నా.. కేంద్రం స్పందించకపోవడం సరికాదని అన్నారు. మావోయిస్టులతో కేంద్రం వెంటనే చర్చలను జరపాలని డిమాండ్ చేస్తూ.. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'శాంతి చర్చలు - మేధో స్పందన' అనే అంశంపై శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ..శాంతి చర్చలకు సానుకూల వాతావరణం ఏర్పడేందుకు కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటన చేయాలని కోరారు. ఆపరేషన్ కగార్ రాజ్యాంగ వ్యతిరేకమని, రాజ్యాంగబద్ధంగా నడుచుకునే ప్రభుత్వాలు దానిని గౌరవించాలని సూచించారు. సమావేశంలో రీసెర్చ్ స్కాలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్, పీస్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, భారత్ బచావో నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఒకరితో నిశ్చయం.. మరొకరితో పెళ్లి

**ఆందోళనలో వధువు బంధువులు**

హుజూరాబాద్ రూరల్,మే16 : తన కూతురికి వివాహం చేసి అత్తవారింటికి పంపాలనుకున్న ఆ వధువు కుటుంబసభ్యుల ఆశలు.. వరుడు మరొక అమ్మాయిని వివాహం చేసుకోవడంతో అడియాసలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రంగాపూర్‌కు చెందిన కుంట శ్రీనివాస్‌రెడ్డి చిన్న కొడుకు మధుకర్‌రెడ్డికి కాట్రపల్లికి చెందిన ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. శుక్రవారం హుజురాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో వివాహం జరపడానికి ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి వరుడు మధుకర్‌రెడ్డి హైదరాబాద్‌లో మరొక యువతిని వివాహం చేసుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో ఇరు కుటుంబాల సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# మూసీ హద్దులు నిర్ధారించాలి

- గరిష్ఠ ప్రవాహ స్థాయిని గుర్తించాలి
- నాలాలు, కల్వర్టులు బాగు చేయాలి
- హైడ్రాకు పలు శాఖల అధికారుల సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): నగరంలో మూసీ నది పరివాహక ప్రాంతంలో హద్దులను నిర్ధారించాలని పలువురు నిపుణులు తమకు సూచించినట్టు హైడ్రా పేర్కొంది. 'మూసీ సరిహద్దు గుర్తింపు-ఓఆర్ఆర్ లోపల నాలా వ్యవస్థతో పాటు వెడల్పుల నిర్ధారణ' అంశంపై శుక్రవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఓ సదస్సు నిర్వహించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ మూసీ ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఆ నది సరిహద్దుల నిర్ధారణ ఎలా చేపట్టాలనే విషయమై ఈ సమావేశంలో చర్చించారు. మూసీ ఆక్రమణలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నందున మూసీ గరిష్ఠ ప్రవాహ స్థాయిని హైడ్రా నిర్ధారిస్తేనే బాగుంటుందని నిపుణులు సూచించినట్టు హైడ్రా ప్రకటించింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను గుర్తించినట్టుగానే మూసీ నది ఎంఎఫ్ఎల్ (మాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్)ను గుర్తించేందుకు గ్రామ, రెవెన్యూ రికార్డులను దృష్టిలో పెట్టుకుని సరిహద్దులు నిర్ధారించాలని కొందరు నిపుణులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు. మూసీ పరివాహక ప్రాంత హైడ్రాలజీ నివేదికలు, ఎన్ఆర్ఎస్‌సీ ఉపగ్రహ చిత్రాలు, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను పరిశీలించి మూసీ హద్దులను నిర్ధారించి నిర్మాణాలు జరగకుండా చూడాలని పలువురు చెప్పారు. నగరంలో 1908, 1954, 2000, 2008వ సంవత్సరాల్లో కురిసిన భారీ వర్షాలు, అప్పటి పరిణామాలను చర్చించి మూసీ నది పరివాహకంలో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని వారు చెప్పారని హైడ్రా పేర్కొంది. వరద ముప్పునకు సంబంధించి నగరంలో నాలాలు కుంచించుకుపోకుండా చూడాలని, జీహెచ్ఎంసీ పరిధిలో 940 ప్రాంతాల్లో కల్వర్టులున్నాయని, అక్కడ చెత్త పేరుకుపోవడంతో వరదనీరు పోవడం లేదని నిపుణులు హైడ్రా దృష్టికి తెచ్చారు. పలుచోట్ల నాలాల లింక్ కట్ అయిందని, దానిని పునరుద్ధరించాలని, కొన్నిచోట్ల కుంచించుకుపోయాయని అక్కడ నిర్మాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా.. కుదిరితే విస్తరణ లేకుంటే మళ్లింపు చేయాలని పలువురు అధికారులు చెప్పారని హైడ్రా తెలిపింది. ఈ సదస్సులో రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, హైడ్రాలజీ, ఎస్ఎన్‌డీపీ, ఎన్ఆర్ఎస్‌సీ, జీహెచ్ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తోపాటు అర్బన్ డెవలప్‌మెంట్‌లో భాగస్వాములుగా ఉన్న పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



హైడ్రా కార్యాలయంలో జరిగిన సదస్సులో కమిషనర్ రంగనాథ్, అధికారులు, నిపుణులు

# ఎకరాకు రూ.5 కోట్లిస్తేనే భూములు

- లేకుంటే 3 కోట్లు, ఉద్యోగం ఇవ్వండి
- కాదంటేఫోర్త్‌సిటీ రోడ్డుకుభూములివ్వం
- అధికారులకు తేల్చిచెప్పిన రైతులు

కందుకూరు, మే 16: ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధిలోని రాచులూరు రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, భూసేకరణ అధికారి రాజు, తాసిల్దార్ గోపాల్ నిర్వహించిన గ్రామసభలో వారు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు ఇవ్వాలని అధికారులు కోరడంతో అందుకు రైతులు అంగీకరించలేదు. తామంతా సన్న, చిన్నకారు రైతులమని, తమ భూములు తీసుకుంటే బజారున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో తమ భూములు ఎకరా రూ.5 కోట్లు పలుకుతున్నదని, కావాలనుకుంటే ప్రభుత్వం తమకు ఆ రేటు చెల్లించి తీసుకోవాలని తెలిపారు. ఒకవేళ అందుకు అంగీరించని పక్షంలో ఎకరాకు రూ.3 కోట్ల చొప్పున చెల్లించి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని అధికారులను కోరారు. తమ భూములను బలవంతంగా లాక్కుంటే వేరే భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసలు తమకు ప్రభుత్వం ఎంత నష్టపరిహారం చెల్లిస్తుందో చెప్పకుండా గ్రామసభలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని, తమ భూములపై ప్రభుత్వ పెత్తనం ఏమిటని రైతులు ప్రశ్నించారు. పోలీస్ బలగాలను మోహరించి తమ భూములను సర్వే చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ.. 'మా భూముల వద్దకు వెళ్లే హక్కు మాకు లేదా?' అని నిలదీశారు. దీంతో అధికారులు కల్పించుకొని ఫోర్త్ సిటీ రోడ్డులో ఎంత మంది రైతుల భూములు పూర్తిగా పోతున్నాయో గుర్తిస్తామని, వారికి ఇచ్చేందుకు వేరేచోట భూములు లేనట్టయితే నష్టపరిహారంతోపాటు కుటుంబంలో 18 ఏండ్ల వయసు నిండినవారు ఎంత మంది ఉంటే అంతమందికి రూ.5.50 లక్షల చొప్పున అదనంగా చెల్లిస్తామని రైతులకు తెలిపారు.



రాచులూరులో మాట్లాడుతున్న రాజు